
# మోసం

రావిపల్లి నారాయణరావు

నగరంలో నేరాలసంఖ్య బాగా పెరిగింది. అల్లర్లకు అంతులేకుండా పోయింది. మారణహోమాలకు, ఆస్తుల విధ్వంసానికి ఆలవాలమైంది పట్టణం. ఈ బీభత్సం నుండి బయటపడగలమా అన్న భయభ్రాంతులతో ప్రజలు గుండెలమీద చేతులు పెట్టుకుని గుట్టుగా జీవితం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో దోపిడి దౌర్జన్యాలకు అడ్డుకట్టవేస్తామని గుడ్‌విల్ సెక్యూరిటీ ఫోర్స్ ప్రయివేటు సంస్థ ఒకటి ముందుకొచ్చింది. స్టేడియంలో ఒక సభ నిర్వహించడా



**నికి ఆ సంస్థ అనుమతి తీసుకుంది. ఆహ్వానితులు తప్ప ఆ మీటింగ్‌కు ఇతరులెవ్వరూ హాజరు కాకూడదన్న ఆంక్ష విధించారు. ప్రభుత్వ సంస్థల్లోను, ప్రయివేటు రంగాల్లోను సెక్యూరిటీ అనుభవం ఉన్న పెద్దలకు, గౌరవనీయులకు సభకు హాజరు కావలసిందిగా కోరుతూ ఆహ్వానాలు పంపించటం జరిగింది.**

కాన్ఫరెన్స్‌కు ముందు ఆహ్వానితులను ఆనంద పరచటానికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

సమయం సాయంత్రం ఆరుగంటలు. రంగు రంగుల బేనర్లు స్టేడియం చుట్టూ వేలాడుతూ కొట్టొచ్చినట్టు కనబడ్డాయి.

ఇన్విటేషన్స్ తీసుకురాని వ్యక్తుల్ని స్టేడియంలోనికి పోనివ్వటం లేదు సెక్యూరిటీ గార్డులు. అధికారులు, అనధికారులు మొదలైన వారితో ఆ స్టేడియం కిక్కిరిసిపోయింది.

నేను స్టేడియం చేరేసరికి సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ప్రారంభమైంది. ముఖ్య అతిథుల కోసం ముందున్న కుర్చీలు కొన్ని రిజర్వుడుగా కేటాయించబడ్డాయి. మొదటి వరుసలో మూడో కుర్చీపై ఉన్న పేరు చూసి నేను కూర్చున్నానో లేదో నా పక్కనున్న కుర్చీలో కూర్చున్నాడు ఒక ఆజానుబాహుడు. కుర్చీలో నేను కూర్చోబోయేముందు పక్కనున్న కుర్చీపై ఉన్న పేరు చదివాను నేను. అది పోలీసు అధికారి ఐజీ గారికోసం రిజర్వు చేయబడిన కుర్చీ. ఇప్పుడు స్టేడియంలోని లైట్లన్నీ ఎందుకో అనుకోకుండా ప్రకాశించాయి. ఆ దీపాల వెలుగులో పక్కన కూర్చున్న వ్యక్తిని పరిశీలించి చూశా. అతను ఆరడుగులపైన వుంటాడు. పొడవుకు తగ్గ శరీరం. బ్లూ కలర్ సూట్లో అతని అందం కొట్టొచ్చినట్టు కనబడింది. వయసు ముప్పైకి మించి వుండదు. ఇతను ఐజీయా! ఊర్లోగాని, కోర్టులో గాని ఇంతకు ముందు అతన్ని నేను చూసిన దాఖలాలు లేవు. ప్రత్యేకంగా నేను కొన్ని నిముషాలు రెప్పవేయకుండా చూస్తుండటం గమనించాడేమో, అతను నా వైపు తిరిగి...

''మీరు లాయరు లీలావతి కదూ!'' అన్నాడు.

కొన్ని క్షణాలు నేను అవాక్కయ్యాను.

'' ఏమిటలా చూస్తున్నారు. గడచిన ఆదివారం సెకండ్ ఏసీలో చెన్నైనుండి ప్రయాణం చేశారు మీరు, మరచిపోయారా?''అడిగాడు అతను.

''అవును. ఆరోజు చెన్నై వెళ్ళి తిరిగొస్తున్నాను హౌరా మెయిల్లో''

''అవును కదా. అదే ట్రైన్లో మీ ఎదుట సీట్లో కూర్చుని ప్రయాణం చేశాను నేను'' అన్నాడు.

''యస్.. ఇప్పుడు గుర్తొచ్చింది. విజయవాడ స్టేషన్లో బండి దిగి మీరు నాకు మినరల్ వాటర్ బాటిల్ తెచ్చిపెట్టారు'' అన్నాను.

అప్పుడే స్టేడియంలో ఏదో గందరగోళం. పోలీసులు అటు, ఇటు హడావిడిగా తిరుగుతున్నారు. పోలీసులు ఎవరికోసమన్నా వెతుకుతున్నారా? లేక వచ్చే గెస్టులను గైడ్ చేస్తున్నారా? అర్థం కావటం లేదు. మరుక్షణంలోనే ఇద్దరు కానిస్టేబుల్స్ వచ్చి మా ఎదుట నిలబడ్డంతో మా సంభాషణ అర్ధాంతరంగా ఆగిపోయింది. ఆ తర్వాత ఎస్సై కూడా అక్కడకు రావటం నేను చూశాను.

''హలో.. మీరెవరు, మీపేరేమిటి? ఆ కుర్చీ మా ఐజీగారి కోసం రిజర్వు చేయబడింది. మీరు గమనించి వుండరు'' నా పక్క కుర్చీలో కూర్చున్న మనిషి దగ్గరకు వెళ్ళాడు ఇన్స్పెక్టర్.

''ఇది రిజర్వుడు సీటు.. నాకు తెలుసు. తెలిసే కూర్చున్నా'' చెప్పాడు పక్కన కూర్చున్న వ్యక్తి.

''చాలా పొరపాటు చేశారు. దీనిలో ఐజీగారు కూర్చోవాలి'' అన్నాడు ఇన్స్పెక్టర్.

''ఈ కుర్చీలో నేను కూర్చున్నానంటే నేనే ఐజీనని మీకు ప్రత్యేకించి చెప్పాలా! వెళ్ళండి ప్రోగ్రామ్ చూస్తున్నాను. నన్ను డిస్ట్రబ్ చేయొద్దు ప్లీజ్''

**ఇప్పుడు స్టేడియంలోని లైట్లన్నీ ఎందుకో అనుకోకుండా ప్రకాశించాయి. ఆ దీపాల వెలుగులో పక్కన కూర్చున్న వ్యక్తిని పరిశీలించి చూసినతను ఆరడుగులపైన వుంటాడు. పొడవుకు తగ్గ శరీరం. బ్లూ కలర్ సూట్లో అతని అందం కొట్టొచ్చినట్టు కనబడింది. వయసు ముప్పైకి మించి వుండదు. ఇతను ఐజీయా!**

''ఏయ్ మిస్టర్! మర్యాదగా చెబితే నీకు అర్థం కాదా? మా ఐజీగారు అక్కడ నిలబడి చూస్తున్నారు. తక్షణం కుర్చీ ఖాళీ చేయకపోతే మా లాఠీకి పని కల్పించాల్సి వుంటుంది''

పోలీస్ ఇన్స్పెక్టర్ మాట పెడచెవిని పెట్టాడు కుర్చీలో కూర్చున్న మనిషి. ఘర్షణ కనిపెట్టి సెక్యూరిటీ గార్డులు క్షణంలో అక్కడికి చేరుకున్నారు. గార్డులు, పోలీసులు ఫిజికల్‌గా ఆరడుగుల మనిషిని బయటకు తీసుకెళ్ళారు. ఆ కుర్చీలోని వ్యక్తి పోలీసుల ఎదుట దురుసుగా ప్రవర్తించటం నా దృష్టినుంచి తప్పుకోలేదు.

* * *

ఉదయం ఎనిమిది గంటలకు ఎప్పటిలాగే కాఫీ తాగుతూ పేపర్ హెడ్‌లైన్స్ చూస్తూ ఆఫీసురూమ్‌లో కూర్చున్నాను. కాలింగ్‌బెల్ శబ్దం చెవిన పడింది. తలపైకెత్తి చూశాను. ఎవరో బయట వెయిట్ చేస్తున్నట్టుంది.

''కమిన్. తలుపు తెరిచే వుంది'' ఖాళీ కప్పు ట్రేలో పెట్టాను.

రెండురోజుల కింద మున్సిపల్ స్టేడియంలో కనబడ్డ ఆరడుగుల మనిషి లోపలికి వచ్చి చెప్పాడు- ''నా పేరు రాజగోపాలం. మొన్న స్టేడియంలో కల్సుకున్నాం కదండీ''

''మీరా! రండి కూచోండి'' నా ఎదుట వున్న కుర్చీ చూపించాను.

''అపాయింట్‌మెంట్ తీసుకోకుండా మిమ్మల్ని డిస్ట్రబ్ చేస్తున్నాను. క్షమించండి'' కుర్చీలో కూర్చున్నాడు అతను.

''ఇట్సాల్ రైట్.. అసలు మీరిక్కడికెందుకొచ్చారు? నాతో మీకేంపని?''

''బాగుందండీ.. లాయర దగ్గరకు క్లయింట్స్ ఎందుకొస్తారు?''

''ఓకే. విషయం చెప్పండి''

''మేడమ్! ఆరోజు మీ ఎదుటే పోలీసులు నన్ను కొట్టారు. అరెస్టు చేశారు. ఎఫ్ఫైయ్యారు రాసి కోర్టుకు పంపారు. రేపు కోర్టులో చార్జిషీటు పెడతారని తెలిసింది. ఈ ఊళ్ళో మీకు మించిన లాయరు మరొకరు లేరు. మీరు చేపట్టిన కేసుకు ఓటమి వుండదు. ఆ విషయం చాలామంది చెప్పారు. మీరు నన్ను కాపాడగలరన్న నమ్మకం నాకుంది. నాకున్న కొద్దిపాటి పరిచయాన్ని పురస్కరించుకుని ధైర్యం చేసి మీదగ్గరకొచ్చాను. క్షమించండి'' అన్నాడు రాజగోపాల్.


''నామీద మీకున్న విశ్వాసానికి చాలా థాంక్స్. కాని నిజాన్ని అబద్ధంగా, అబద్ధాన్ని నిజంగా చిత్రించటం నాకు చేతకాదు. అది నా వృత్తి కాదు. పైగా నేను సివిల్ కేసులు వాదించే లాయర్ని. నేను క్రిమినల్ కేసులు టేకప్ చేయనని మీకు ఎవరూ చెప్పలేదా?'' అన్నాను.

''చెప్పారు. కాని సివిల్ కేసులు వాదించే లాయర్లు క్రిమినల్ కేసుల జోలికి పోకూడదన్న రూలు లేదు కదా.. అందుకనే మీ దగ్గరకొచ్చాను'' చెప్పాడు రాజగోపాల్.

''మీరు వచ్చారు.. ఓకే. కాని ఈ కేసు నేనెలా టేకప్ చేస్తాననుకున్నారు? నా కళ్ళముందు జరిగిన నేరాన్ని నేనెలా కాదనగలను? ఇదేం చిన్న నేరం కాదు. ఇంపర్సనేషన్. నో-నో-నేను ఈ కేసు టేకప్ చెయ్యలేను. మీరిక వెళ్ళచ్చు'' అన్నాను సీరియస్‌గా.

''మేడమ్! అలా అనకండి. మీరు నన్ను కాపాడక పోతే నా బ్రతుకు నాశనమైపోతుంది'' అతని కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరిగాయి.

''బాగుందండీ.. ఆడది కదా కన్నీళ్ళు చూసి కరిగిపోతుందనుకున్నారా. అదేం కుదర్దు. అవునండీ, నాకు తెలీక అడుగుతాను మీకిదేం సరదా అండి. వ్యసనాలకు దాసులైన వారు రకరకాల నేరాలు చేస్తారు. తప్పతాగి తాగుబోతు తనకు తెలియని తప్పులెన్నో చేస్తాడు. ఒక వ్యభిచారి కోరికను తీర్చుకోటానికి తన వలలో పడ్డ వనితను రేప్ చేయకుండా వదలడు. మరికొందరు నేరగాళ్ళు దోపిడీ




చేస్తారు. హత్యలు చేస్తారు. లంచాలు తీసుకుంటారు. ఫోర్జరీ చేయటానికి కూడా భయపడరు. ఇటువంటి నేరాలు చేసే ప్రతి మనిషి వెనుక స్వార్థం వుంటుంది. మీరు శ్రీమంతుల ఇంట్లో పుట్టి పెరిగినట్టు కనిపిస్తున్నారు. మీరిలా ఐజీనని, కలెక్టర్నని, మినిస్టర్నని చెప్పుకు తిరిగితే మీకు వొరిగేదేమిటి? ఆరోజు స్టేడియం దగ్గర పోలీసుల ద్వారా నేను కొన్ని విషయాలు తెలుసుకున్నాను. ఇంతకు ముందు ఇటువంటి కేసుల్లో మీరు చాలాసార్లు జైలుకెళ్ళినట్టు కూడా నాకు తెలిసింది. ఇంతకీ మీరెవరు? ఏం చేస్తుంటారు? అడ్రసు ఏమిటి?'' నేను అడిగాను.

కోటు జేబునుండి విజిటింగ్ కార్డు ఒకటి తీసి నాముందు పెట్టాడు.

కార్డులోని వివరాలు చూసిన తర్వాత ఒక క్షణం తటపటాయించాను. ఈ కేసు టేకప్ చేయలేనని నిర్మొహమాటంగా నేను చెప్పలేకపోయాను.

* * *

ఎండ నిప్పుల్ని చెరుగుతున్నట్టుంది. కాంపౌండులో కారుని పార్క్‌చేసి కోర్టుహాల్లో కూర్చున్నాను. మెజిస్ట్రేటుగారు ఇంకా రాలేదనుకుంటాను. పోలీసులు, కేసులకు సంబంధించిన పార్టీలు ఆరుబయట ప్రదేశంలో చెట్ల నీడన కూర్చుని వున్నారు. టైము పదకొండు దాటింది. కోర్టుహాల్లో సీలింగ్ ఫ్యాన్ మంచి స్పీడులో తిరుగుతూ వున్నా శరీరం చెమట్లు పోసింది.

''హలో లీలావతి గారూ– వాట్ ఎ సర్‌ప్రైజ్! ఎన్నడూ క్రిమినల్ కేసులు చేపట్టని మీరు ఈసారి సివిల్ కోర్టులు దాటుకుని ఇక్కడకు రావటం చాలా విడ్డూరంగా వుంది'' నా పక్కన కూర్చుని అడిగారు యాజులుగారు.

ఆయన వాదించిన క్రిమినల్ కేసులకు తిరుగులేదు. కేసులలో చిక్కుకున్న ఉద్యోగులు చాలా మంది అతనివల్ల లబ్ధిపొందారు. ఆయన ఆర్గ్యుమెంట్స్ ఎంతో ఆసక్తికరంగా వుంటాయి. చాలా మంది జూనియర్ లాయర్లు పని వున్నా లేకపోయినా అప్పుడప్పుడు ఆర్గ్యుమెంట్స్ వినటానికి అతని వెంట కోర్టుకు వెళ్తూవుంటారు.

''నేను సివిల్ కేసులకే ఇంపార్టెన్స్ ఇస్తానన్న మాట నిజమే. అలాగని క్రిమినల్ కేసు వాదించకూడదన్న నియమనిబంధన ఏమీ లేదు'' అన్నాను.

''ఆఫ్‌కోర్స్.. ఈ కోర్టుకు వచ్చారంటే ఏదో ఒక ప్రత్యేకమైన కారణం వుండొచ్చని నేననుకుంటూ వున్నాను''

''మీరు ఊహించింది కరెక్టే. ఎగినెస్ట్ మైవిల్ నేనిక్కడికి వచ్చాను'' కేసు వాదించమని రాజగోపాల్ ఇచ్చిన విజిటింగ్ లాయర్ యాజులు గారికి చూపించాను.

''మీ నిర్ణయం సరైనదే'' నేనిచ్చిన విజిటింగ్ కార్డు తిరిగి నా చేతిలో పెడుతూ అన్నారు యాజులు గారు.

''అది సరే యాజులుగారూ! మీరు వచ్చినప్పటి నుండి చూస్తున్నాను. వచ్చిన ఇరవై నిముషాల వ్యవధిలో నశ్యం పట్టుని నాలుగైదుసార్లయినా ముక్కుపుటాలలోనెక్కించి వుంటారు. ఆ వ్యసనం అంత తీవ్రమైందా?'' నేను యాజులు గారిని అడిగాను.

''ఈ వ్యసనం గురించి విపులంగా చెప్పే అవకాశం ఈనాడు లభించటం నాకు చెప్పలేనంత ఆనందాన్ని కలిగిస్తోంది. పైగా మెజిస్ట్రేటుగారు జడ్జిగారి దగ్గరకు వెళ్ళారట. ఆయన తిరిగి రావటానికి మరొక గంట అయినా పట్టవచ్చు అంటున్నాడు డఫేదారు. చాలాకాలం తర్వాత మీరు ఈ కోర్టులో అడుగుపెట్టారు కదా.. అందుకేనేమో ఈ ఆలస్యం. మనం కథలు చెప్పుకోటానికి టైం దొరికింది లెండి'' యాజులు గారు మరో చిటికెడు నశ్యం ముక్కుపుటాల్లోకెక్కించి కథ చెప్పడం మొదలుపెట్టారు.

''చూడండి లీలావతి గారూ! నేనిదివరకు కిళ్ళీ నమిలేవాడిని. సిగరెట్లు కాల్చే అలవాటు కూడా నాకు వుండేది. అలాంటి దురలవాట్లన్నింటికి స్వస్తి చెప్పాను. ఎందుకంటే అటువంటి అలవాట్లు ఎక్కడ బడితే అక్కడ ఆచరణలో పెట్టలేము. సభ్యత, సంస్కారం అడ్డొస్తాయి. కాని నశ్యం కూడా నాకు వుండేది. అలాంటి దురలవాట్లన్నింటికీ స్వస్తి చెప్పాను. ఎందుకంటే అటువంటి అలవాట్లు ఎక్కడబడితే అక్కడ ఆచరణలో పెట్టలేము. సభ్యత, సంస్కారం అడ్డొస్తాయి. కాని నశ్యం ముక్కుపుటాల్లోకి ఎక్కించటానికి ఎవరూ అభ్యంతరం చెప్పరు. ముఖ్యంగా కోర్టుహాల్లో కూడా ఆ పనికి అంత రాయం కలగదు. అటువంటి అవకాశం వుంది కనుకనే నేను నశ్యం వ్యసనానికి దూరం కాలేదు'' అన్నారు యాజులు గారు.

టైమ్ పదకొండున్నరైంది. మెజిస్ట్రేటుగారు వచ్చి మొదటి కేసు పరిశీలించారు. బెంచి గుమస్తా ముద్దాయిని ప్రవేశపెట్టమని చెప్పగానే డఫేదారు నా క్లయింట్ రాజగోపాల్‌ని పేరుపెట్టి పిలవటం, ఆ వెంటనే అతను కోర్టు హాల్లోకి రావటం వెంటవెంటనే జరిగాయి.

బోనులో నిలబడ్డాడు రాజగోపాల్.

కేసుఫైల్‌ను చూసి మెజిస్ట్రేటుగారు చెప్పటం మొదలెట్టారు–

''ఈ కేసును విచారణకు తీసుకోబోయేముందు నేనొక విషయం మీకు చెప్పాల్సి వుంది.. జీవితంలో ఎక్కువ అనుభవం లేని విద్యార్థులు, యువకులు ఇటువంటి నేరాలు చేయటానికి దోహద పడిన పరిస్థితులు, అలాంటి పరిస్థితులు ఏర్పడటానికి ఎవరు ఎంతవరకు బాధ్యులు అన్న విషయం గురించి మనం తెలుసుకోవలసి వుంది. కొడుకు తనకంటె గొప్పవాడు కావాలని ఏ కన్నతండ్రయినా కోరుకుంటాడు. అలాగే తన రక్తాన్ని పంచుకు పుట్టిన కూతురు మెట్టినింట్లో మంచి ఇల్లాలిగా పేరు తెచ్చుకుంటుంటే విని ఆనందించాలని తల్లిదండ్రులు ఆశించటం సహజం. వారి కలలు నిజం కావాలంటే పిల్లల పెంపకంలో తల్లిదండ్రులిద్దరూ మొదటి నుంచి ఎంతో అప్రమత్తంగా వుండాలి. పిల్లల్ని మంచి మార్గంలో పెట్టటానికి ఎంతో కృషి చేయాలి. బాగా చదివించాలి. క్రమశిక్షణతో రాజీ పడకుండా జీవితంలో వారిని ముందుకు పోనివ్వాలి. చెడుత్రోవ పట్టకుండా వారి నడవడికను పర్యవేక్షిస్తూ వుండాలి. మరీ బాధ్యతను ఎవరు తలపై వేసుకుంటారు? తల్లా? లేక తండ్రా? సంసారపు బండికి భార్యాభర్తలిద్దరూ రెండు చక్రాలు. ఆ రెండు చక్రాలు కలిసి పని చేసినప్పుడే బండి నిరాటంకంగా ముందుకు సాగిపోతుంది. పిల్లల మంచి చెడ్డలు చూడటానికి టైము నాకెక్కడిది? అని కన్నతల్లి ఆఫీసు పనులతోనే నేను వేగలేక చస్తున్నాను, పిల్లల బాగోగులు నేను చూడగలనా? అని తండ్రి తప్పించుకు తిరిగితే పిల్లల భవిష్యత్తు మాటేమిటి? అంతులేని అనురాగం తల్లిదండ్రులు చూపించడంలో పిల్లలు చెడుదారి పడుతున్నారు. క్రమశిక్షణ లేకుండా పెరిగిన పిల్లలు ఎటువంటి నేరం చేయటానికైనా సాహసిస్తారు. ఏది తప్పు, ఏది రైటు అన్న జ్ఞానం వాళ్ళకుండదు. ఇప్పుడు బోనులో

వున్న ముద్దాయి రాజగోపాల్‌నే ఉదాహరణగా తీసుకుందాం. రెండు రోజులక్రితం అతను స్టేడియంలో జరిగిన ఒక కాన్ఫరెన్స్‌కెళ్ళి తనే పోలీస్ ఐజీనని చెప్పుకుని, ఐజీకోసం రిజర్వు చేసి కుర్చీలో కూర్చున్నాడు. కుర్చీ ఖాళీ చేయమని మర్యాదగా పోలీస్ ఇన్స్‌పెక్టర్ చెప్పినా అతను వినిపించుకోలేదు. పైగా ఆ ఫంక్షన్‌లో దురుసుగా ప్రవర్తించాడు. దీనివల్ల అతను పొందిన లాభం, సాధించిన ప్రయోజనం ఏమీలేదు. ఆ విషయం అందరికీ తెలిసినదే.. ఆలోచిస్తే చిన్నప్పుడు అతను పెరిగిన వాతావరణమే తననిలా తయారు చేసి వుండొచ్చు అనిపిస్తుంది. ఈ కేసు విచారించటానికి నేను సుముఖంగా లేను. ఎందుకంటే ముద్దాయి రాజగోపాల్ కూడా నన్నూ, మా కుటుంబ సభ్యుల్ని మోసం చేయటానికి ప్రయత్నించాడు. గడచిన వారం నా కూతుర్ని పెళ్ళి చేసుకుంటానని పెళ్ళిచూపులకు మా ఇంటికొచ్చాడు. ఒక మాజీ మంత్రి మేనల్లుడినని, వైజాగ్ పోర్ట్ ట్రస్టులో అక్కౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నట్టు అబద్ధం చెప్పాడు. కాని అతని మోసం మా ఎదుట పనిచేయలేదు. అందువల్ల ఈ కేసును ఇక్కడ విచారించటం సముచితం కాదు. మరో కోర్టుకు పంపించటమే మంచిది. ఈ సందర్భంగా నేడే జిల్లా జడ్జిగారికి ఉత్తరం రాస్తాను''చెప్పారు మెజిస్ట్రేటుగారు, చేతిలోని కేసుఫైల్‌ను పక్కన పెడుతూ.

మెజిస్ట్రేట్ అల్లుడనని విజిటింగ్ కార్డులో రాసి, చాలాకాలం తర్వాత మిమ్మల్ని క్రిమినల్ కోర్టుకు రప్పించిన ముద్దాయి రాజగోపాల్‌ను నేను ఎన్నటికీ మరచిపోలేను.. పక్కన కూర్చున్న నా చెవిలో మెల్లగా గొణిగారు లాయర్ యాజులు.

★

## బ్రేక్ ఎప్పుడో?

**ఫి**రోజ్‌ఖాన్ కుమారుడు ఫర్దీన్‌ఖాన్‌కి అవకాశాలు కలిసిరావడం లేదు. బాలీవుడ్‌కి వచ్చి ఐదేళ్ళు దాటినా ఇంతవరకూ బ్రేక్ రాలేదు. అతని నటనకు మంచి మార్కులే పడుతున్నాయి కానీ, సినిమాలు హిట్ కావడం లేదు. రాంగోపాల్ వర్మ సినిమా జంగిల్ కూడా ఫట్‌మనేసరికి బ్యాడ్‌లక్ స్టార్‌గా ముద్ర పడుతోజంది. హిట్‌కి తప్ప దేనికి విలువ లేని సినీ రంగంలో ఫర్దీన్‌కి ఎప్పటికి బ్రేక్ వస్తుందో చూడాలి.

